

బైక్ చోరీకి యత్నం

బైక్‌ను చోరీకి యత్నిస్తున్న ఇద్దరు యువకులను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. 8లో▸



నీట్ లీకేజీపై విచారణ

నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. 8లో▸



సమస్యలు పరిష్కరిస్తాం

గత పాలకుల నిర్లక్ష్యంతో పశు వీర్య శుద్ధి కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదని ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. 8లో▸

న్యూస్‌రీల్

సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీఓ మాధురి

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు ఎంపీడీఓ మాధురి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలనలో భాగంగా వివిధ పథకాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ పథకాలు అందకపోతే అర్హులైన వారు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తులను తీసుకుని వచ్చి ప్రజాపాలన సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఎంఈఓపై ఫిర్యాదు



డీఈఓకు ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ, కాంగ్రెస్ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్: నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఏర్పాటుకు అనుమతులిచ్చిన ఎంఈఓ వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బుధవారం డీఈఓకు సుశీందర్‌రావుకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని గౌరెల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న భవనం అనుమతులకు విరుద్ధంగా నిర్మించారని కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు ఆరోపించారు. నిర్మాణం పూర్తికాకుండానే రివర్‌వ్యాలీ ఇంటర్నేషనల్ పాఠశాల ఏర్పాటుకు అనుమతులు ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్, మండల అధ్యక్షుడు కృష్ణ, కాంగ్రెస్ నాయకులు ధన్‌రాజ్, చిరంజీవి, మైసయ్య తదితరులున్నారు.

'హైదరాబాద్-బీజాపూర్' పనుల్లో వేగం పెంచండి

ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు పీసీబీ సభ్యుడి వినతి



ఆర్‌ఎం నాగేశ్వర్‌రావుతో పీసీబీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి

చేవెళ్ల: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు నేషనల్ హైవే అథారిటీ అధికారులు చెప్పారని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లోని నేషనల్‌హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ నాగేశ్వర్‌రావును ఆయన ఆఫీసులో కలిశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి విస్తరణ పనులకు ఐదేళ్ల క్రితం నిధులు మంజూరైనా ఎందుకు పనులు జరగలేదని తెలుసుకున్నారు. ఈ రోడ్డుపై పెరిగిన రద్దీతో నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని ఆయనకు వివరించానన్నారు. త్వరగా పనులు ప్రారంభించాలని కోరామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని.. పనులకు సంబంధించిన రిపోర్టులు సైతం అందిచామన్నారని చెప్పారు.

రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.10 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: డ్రగ్స్ అక్రమ రవాణాలో మీ మొబైల్ నెంబర్ వినియోగించారంటూ బెదిరించి ఓ రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. నగర సైబర్ క్రైమ్ పోలీసులు తెల్పిన వివరాల ప్రకారం..నగరానికి చెందిన 78 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి 'మీ మొబైల్ నంబర్‌ను డ్రగ్స్ స్మగ్లింగ్‌లో ఉపయోగించారు. అందువల్ల మీ నంబర్‌ను బ్లాక్ చేస్తాం' అని ట్రాయ్ నుంచి సందేశం వచ్చింది. ట్రాయ్‌కి చెందిన సీనియర్ అడ్వైజర్ మాట్లాడుతున్నామని చెబుతూ సిమ్ కార్డును పొందేందుకు మీ ఆధార్ నంబర్ ఉపయోగించారని, ఆ తర్వాత 200 జామ్ బ్యాగ్‌ల ఎండీఎంఏ డ్రగ్స్‌ను రవాణా చేయడానికి ఉపయోగించారని చెప్పారు. అనంతరం ముంబై సైబర్ క్రైమ్ పోలీసులమంటూ కేటుగాళ్లు వాట్సాప్ కాల్ చేశారు. పోలీసు సిబ్బందిని పంపిస్తామని బెదిరించారు. తమకు రూ.10 లక్షలు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడు భయపడి..స్నేహితుల వద్ద డబ్బులు తీసుకుని ఆర్టీజీఎస్ ద్వారా మోసగాళ్ల ఖాతాలకు బదిలీ చేశాడు. అనంతరం ఇది మోసమని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి తెలిపారు.

మహేశ్వరంలో వైద్య విద్యకు తొలి అడుగు

50 సీట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు రంగం సిద్ధం

- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- మంగళ్‌పల్లిలోని ఓ ప్రైవేట్ భవనంలో కళాశాల
- వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో శిక్షణ
- ఒకటి రెండు రోజుల్లో ఎన్‌ఎంసీ రాక



మీర్‌ఖాన్ పేటలో కళాశాల నిర్మాణానికి వేసిన శిలాఫలకం(ఫైల్)

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాలలో అడ్మిషన్లు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే గాంధీ మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణను కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించిన వైద్య ఆరోగ్యశాఖ..తాజాగా అడ్మిషన్లు, తరగతుల నిర్వహణ, శిక్షణ వంటి అంశాలపై దృష్టిసారించింది. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఈ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు భూమి కేటాయించిన విషయం తెలిసిందే. గత ఏడాది అక్టోబర్‌లో శంకుస్థాపన కూడా చేశారు. వరుస ఎన్నికలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంగళ్‌పల్లి సమీపంలోని ఐదు అంతస్తుల ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో జాతీయ వైద్య మండలి బృందం ఈ భవనాన్ని తనిఖీ చేయనుంది. తరగతుల నిర్వహణ, విద్యార్థుల వసతి, పరిపాలన సౌలభ్యం కోసం అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేదా వంటి అంశాలను పరిశీలించనుంది.

వనస్థలిపురంలో తరగతులు

- నిబంధనల మేరకు కొత్తగా వైద్యకళాశాల ఏర్పాటు చేయాలంటే ఐదేళ్లకు సరిపడు మౌలిక సదుపాయాలను ముందే చూపించాలి.
- కాలేజీకి సమీపంలో అనువైన టీచింగ్ ఆస్పత్రి కూడా ఉండాలి. అది కూడా 20 కిలోమీటర్ల లోపే ఉండాలి.
- నిజానికి తొలుత కందుకూరు, మహేశ్వరం పరిసరాల్లోని ఏదైనా అద్దె భవనంలో ఈ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ పరిసరాల్లో అనువైన భవనం అందుబాటులో లేకపోవడం, షాద్‌నగర్ ఆస్పత్రి మెడికల్ కాలేజీకి సుదూరంగా ఉండటం, సమీపంలోని మహేశ్వరం ఆస్పత్రిలో విద్యార్థుల నిష్పత్తి మేరకు పడకలు లేకపోవడంతో మంగళ్‌పల్లిని ఎంచుకున్నారు.
- ఓ ప్రైవేటు కాలేజీ యాజమాన్యం మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని నూతన భవనం నిర్మించింది. అయితే, అనుమతులు రాకపోవడంతో ఈ బిల్డింగ్ ఖాళీగా ఉండిపోయింది. లక్ష చదరపు అడుగులు అవసరమవ్వగా ఇక్కడ 1.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనం ఉండటం కలిసొచ్చే అంశంగా మారింది.
- అడ్మినిస్ట్రేషన్, తరగతుల నిర్వహణ, హాస్టళ్లకు సరిపడే గదులు అందుబాటులో ఉండటమే కాకుండా దీనికి సమీపంలోనే వంద పడకల సామర్థ్యంతో వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి కూడా ఉంది. వైద్య విద్యార్థుల శిక్షణ కోసం ఆస్పత్రిలోని పడకల సామర్థ్యాన్ని 250 పడకలకు పెంచనున్నారు. రెండో సంవత్సరం నుంచి శేరిగూడలో తరగతులు నిర్వహించి, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ఓపీ, ఐపీ విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన నియామకం

ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనుండటంతో ఇప్పటికే వైద్య ఆరోగ్యశాఖ అర్హులైన వైద్య సిబ్బందిని నియామక ప్రక్రియను చేపట్టింది. ఇప్పటికే 22 మంది సీనియర్ రెసిడెన్సీలతో పాటు ఐదుగురు డ్యూటీ డాక్టర్లను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తీసుకుంది. మరో 27 మంది టెక్నీషియన్లను అలాట్ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం ఈ ఫైలు కలెక్టర్ వద్దే పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. తొలి ఏడాది 50 సీట్లు భర్తీ చేయనుంది. ఆ తర్వాత సీట్ల సంఖ్యను పెంచనుంది. ఇదిలా ఉంటే మహేశ్వరం మెడికల్ కళాశాలకు గత ప్రభుత్వం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సర్వే నం.112లో 20 ఎకరాలు కేటాయించింది. రూ.160 కోట్లతో మెడికల్ కాలేజీ భవనం, రూ.400 కోట్లతో ఆస్పత్రి బిల్డింగ్ నిర్మించాలని భావించి, ఆ మేరకు అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన సైతం చేశారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

పిల్లలకు 'అల్బెండజోల్'

మాత్రల పంపిణీని విజయవంతం చేద్దాం

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- నేడు నేషనల్ డీవార్మింగ్ డే
- జిల్లాలో 8.9లక్షల మంది పిల్లలున్నట్లు గుర్తింపు
- క్షయ వ్యాధి నివారణకు 'బీసీజీ'

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఈ నెల 20న విధిగా ఒకటి నుండి 19 ఏళ్ల లోపు వయసు ఉన్న పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పక వేయించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ చెప్పారు. బుధవారం ఆమె సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తన చాంబర్లో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నులి పురుగుల వల్ల పిల్లల ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం తదితర రుగ్మతలకు లోనవుతారన్నారు. వీటిని నివారించేందుకు ప్రభుత్వం ప్రతీ ఏడాది రెండు పర్యాయాలు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోందని తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలు, విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతీ ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తొలిరోజు ఏదైనా కారణాల వల్ల మాత్రలు తీసుకోలేక పోయిన వారికి జూన్ 27న అందజేసేలా చూడాలన్నారు.

టీబీ నివారణకు చర్యలు

క్షయ వ్యాధి నివారణకు వయోజనులకు బీసీజీ వ్యాక్సిన్ వేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రతిమాసింగ్ వైద్యాధికారులను ఆదేశించారు. 18 ఏళ్లు పైబడిన వ్యక్తులకు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు, ధూమపానం అలవాటు ఉన్న వారికి, బాధితులతో సన్నిహిత సంబంధాలు కలిగిన వారికి, గత ఐదేళ్లలో టీబీ సోకిన చరిత్ర కలిగిన వారికి బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వచ్చని తెలిపారు. కేన్సర్, హెచ్‌ఐవీ బాధితులకు, గర్భిణులకు, పాలు ఇచ్చే స్త్రీలకు, గత మూడు నెలల్లో రక్త మార్పిడి చరిత్ర కలిగిన వ్యక్తులకు, అనారోగ్యంతో ఉన్న వారికి వ్యాక్సిన్ ఇవ్వొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్‌మోహన్, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి పద్మజ రమణ, డీఈఓ సుశీందర్ రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వందశాతం కార్యాచరణ

జిల్లాలో 19 ఏళ్ల లోపు ఉన్న 8.9లక్షల మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసేందుకు 40 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 1,774 మంది ఆరోగ్య సిబ్బంది మరియు అంగన్వాడీ సిబ్బందితో టీచర్లను సమన్వయం చేసి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్స్, గురుకులాలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో వంద శాతం మాత్రలు వేయాలని ఆదేశించారు.



ప్రగతి చక్రం అవార్డు పొందిన ఉద్యోగులతో ఆర్టీసీ ఉన్నతాధికారులు

సమష్టి కృషితోనే ఆర్టీసీకి లాభాలు

హైదరాబాద్ జోన్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర రావు

ఇబ్రహీంపట్నం: ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగానే ఆర్టీసీ లాభాలబాట పడుతుందని హైదరాబాద్ జోన్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం డిపోలో రీజినల్ పరిధిలోని 14 డిపోలకు చెందిన 29 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రం త్రైమాసిక అవార్డు పురస్కారాలను అందజేశారు. స్థానిక డిపో మేనేజర్ వెంకటనర్సప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్ రీజినల్ పరిధిలోని అన్ని డిపోలు అన్ని విభాగాల్లో ముందంజలో ఉన్నాయన్నారు. ఇందుకు ఉద్యోగుల సమష్టి కృషి కారణమన్నారు. మరింత అంకితభావంతో పనిచేసి ఆర్టీసీని అగ్రగామిగా నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజినల్ మేనేజర్ బి.వరప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మెకానిక్ జగన్, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, ఎంఎఫ్ సత్తయ్య, పలు డిపోల మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ అనీమియాకు చెక్

గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సముజ్వాల



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సముజ్వాల, వెంకటేశ్వర్‌రావు తదితరులు

కడ్తాల్: సికిల్ సెల్ అనిమియాకు కలిసికట్టుగా చెక్ పెడదామని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సముజ్వాల పిలుపునిచ్చారు. బుధవారం సికిల్ సెల్ డే సందర్భంగా మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సముజ్వాల మాట్లాడుతూ.. 2023-2047 యూనియన్ బడ్జెట్ నాటికి సికిల్ సెల్ నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. జూన్ 19 నుంచి జూలై 3వరకు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో ఏడు కోట్ల మందికి వైద్యారోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా సంరక్షణ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు సికిల్ సెల్ అనిమియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తకణాల తగ్గుదల, రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారడం, శరీరం, కీళ్లలో తీవ్రమైన నొప్పులు, ఆయాసం, ఊపిరి ఆడకపోవడం తదితర లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలన్నారు. డాక్టర్ సలహా మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ.. సమతుల్య పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాభివృద్ధి అధికారి రామేశ్వరిదేవి, డిప్యూటీ డైరెక్టర్ పద్మ, డిప్యూటీ వైద్యాధికారిణి గీత, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, ఏటీడీఓ వెంకటయ్య, డాక్టర్ కిరణ్, హెచ్‌డబ్ల్యూఓలు బాల్‌రాజ్, రాములు, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నతండ్రే కాలయముడు

కామవాంఛ తీర్చలేదని బాలికను చంపేశాడు

- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

మియాపూర్: తన కామవాంఛ తీర్చలేదన్న కోపంతో ఓ కన్నతండ్రి ఉన్మాదిగా మారాడు. కూతురు తలను బండరాయికి కొట్టి కిరాతకంగా హత్య చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ దుర్గా రామలింగ ప్రసాద్‌లు వెల్లడించిన ఈ కేసు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట్ లక్ష్మా తండాకు చెందిన బానోత్ నరేష్, శారద దంపతులు. వీరికి కుమారుడు, ఏడో తరగతి చదువుతున్న కూతురు వసంత ఉన్నారు. వీరు బతుకుదెరువుకు ఈ నెల 1న నగరంలోని మియాపూర్ నడిగడ్డ తండాకు వచ్చారు. నరేష్ డెలివరీ బాయ్‌గా, శారద ఇళ్లల్లో పని చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం నరేష్, శారద దంపతులు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంట్లో ఉన్న బాలిక వసంత, ఆమె సోదరుడు గొడవపడ్డారు. బాలిక సొంత ఊరుకు వెళ్దామని పదేపదే అంటూ ఉండేది. ఈ క్రమంలో అన్నతో గొడవపడిన వసంత ఇంట్లోంచి బయటికి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని పక్కింటి ఆమె తండ్రి నరేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే నరేష్ ఇంటికి వచ్చి కూతురు కోసం వెతకసాగాడు. నడిగడ్డ తండా సమీపంలోని మార్గమధ్యలో అతడికి కూతురు కనిపించింది. అమ్మ పని చేసే చోటికి వెళ్దామని చెప్పి కూతురును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు.

బాలికను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి..

మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రోడ్డు వెంబడి ద్విచక్ర వాహనంపై వెళ్తూ మార్గమధ్యలోని కాళికా మాత దేవాలయం వద్ద నరేష్ తన ద్విచక్ర వాహనాన్ని యూటర్న్ తీసుకుని వెనక్కి వచ్చాడు. నడిగడ్డ తండా ఎదురుగా రోడ్డుపై ద్విచక్ర వాహనాన్ని నిలిపివేశాడు. వంట చేయడానికి కట్టెలు తీసుకువద్దామని కూతురుతో చెప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లాడు. కొంతదూరం చెట్ల పొదల్లోకి తీసుకువెళ్లి నరేష్ తన కామవాంఛ తీర్చాలని బాలికపై ఒత్తిడి చేయగా ఆమె ఒప్పుకోలేదు. ఈ విషయం తల్లికి చెబుతానని గట్టిగా అరవడంతో కూతురు వెంట్రుకలు పట్టుకుని గట్టిగా కొట్టడంతో ముక్కులో నుంచి రక్తం వచ్చింది. బాలిక బతికి ఉంటే విషయం ఇంట్లో చెబితే తన పరువుపోతుందని భావించిన నరేష్.. బాలిక తలను బండరాయికి మోది అతి కిరాతకంగా హత్యచేసి ద్విచక్ర వాహనం తీసుకుని వెళ్లిపోయాడు. కూతురును ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లడం, తిరిగి ఒక్కడే రావడం తదితర దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

ఏమీ ఎరగనట్టుగా పోలీసులకు ఫిర్యాదు..

నరేష్ ఇంటికి వెళ్లి తన ఒంటిపై ఉన్న టీ షర్ట్ మార్చుకున్నాడు. భార్య శారద వద్దకు వెళ్లి కూతురు వసంత ఇంట్లోంచి వెళ్లిపోయిందని చెప్పాడు. అక్కడ నుంచి మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు తన కూతురు నరేష్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈ నెల 13న రాత్రి సమయంలో నడిగడ్డ తండా సమీపంలోని చెట్ల పొదల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మృతదేహంపై ఉన్న దుస్తులను చూసి బాలిక వసంతగా పోలీసులు గుర్తించారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి కన్నతండ్రే నిందితుడిగా తేల్చారు. పోలీసులకు ఎలాగైనా విషయం తెలిసిపోతుందని భావించిన నరేష్ మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. కన్నకూతురును తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు స్పష్టంచేశారు.

'పట్నం' కట్ట సుందరీకరణకు..

- రూ.20కోట్ల నిధులు
- తైబజార్ టెండర్ నిలిపేశాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



హెచ్‌ఎండీఏ, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్టను రూ.20 కోట్లు వెచ్చించి సుందరీకరణకు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, ఆర్ అండ్ బీ అధికారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారి సలహాలు, సూచనలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెరువు నిండా నీరున్నందున కంప చెట్ల తొలగింపునకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించామన్నారు. చెరువులో పడి మృతి చెందకుండా ఒక చానల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. నగరానికి సమీపంలో ఉన్నందున చెరువు సుందరీకణకు నిధులను వెచ్చిస్తామన్నారు. శ్రీఇందు కళాశాల ఎదుట అర్ధాంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.

అక్రమ వసూళ్లకు కళ్లెం

ఇబ్రహీంపట్నంలో తైబజార్ పేరుతో అక్రమంగా వసూళ్లకు తెరలేపారని.. దీనికి అడ్డుకట్టవేసేందుకు తైబజార్ టెండర్ నిలిపివేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ సాలీనా రూ.12లక్షలు చెల్లిస్తూ సుమారు రూ.80 లక్షల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. తైబజార్‌ను నిలిపివేసి చిరు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ట్రేడింగ్ లైసెన్స్ పేరిట ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేయొద్దని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వేర్వేరుగా జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, వైస్ చైర్‌పర్సన్ మంగ, కమిషనర్ రవీంద్రసాగర్, హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రజిత, ఇరిగేషన్ డిప్యూటీ డీఈ ఉషారాణి, ఏఈ రాజ్యలక్ష్మి, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఏడీ, ఉద్యోగులు

చేవెళ్ల: మండలంలోని ఆలూరు సబ్‌స్టేషన్‌లో పనిచేసే ఆపరేటర్ ఇటీవల హత్యకు గురికావటంతో అతని కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆపన్నహస్తం అందించడం హర్షణీయమని చేవెళ్ల ఏడీ స్వామి అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఇటీవల హత్యకు గురైన హరియానాయక్ కుటుంబానికి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూ.లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి చేయుతనందించేందుకు విద్యుత్ ఉద్యోగుల సంఘం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఏఈ జానీమోయినొద్దీన్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బైక్ చోరీకి యత్నం

- అడ్డుకున్న గ్రామస్తులు
- పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

చేవెళ్ల: ఓ బైక్‌ను చోరీ చేసి మార్గమధ్యలో మరో బైక్‌ను తస్కరించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు యువకులను స్థానికులు గుర్తించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ బస్‌స్టేజీ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపూర్ బస్‌స్టేజీ వద్ద గ్రామనికి చెందిన కొందరు బైక్‌లు ప్రతిరోజు పార్కు చేసి ఉంటాయి. బుధవారం మధ్యాహ్నం ఇద్దరు గుర్తు తెలియని యువకులు బైక్‌పై వచ్చి పార్కు చేసిన బైక్‌ల వద్ద ఆగి తాళం లేకపోయిన ఓ బైక్‌ను తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో అక్కడే గ్రామస్తులు కొందరు కారులో కూర్చొని వీరిని గమనించారు. కొత్త వ్యక్తులని అనుమానం రావటంతో వారి వద్దకు వెళ్లి ఎందుకు బైక్ తాళం లేకపోయిన తీసేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఆ యువకులు మా బైక్ ఇది.. తాళం పోయిందని చెప్పటంతో గ్రామస్తులకు ఇంకా అనుమానం పెరిగింది. గ్రామస్తులకు చెందిన బైక్‌ను మాదే అనేసరికి వారిని పట్టుకొని గట్టిగా ప్రశ్నించారు. ముందుగా ఎదురు తిరిగిన యువకులు గ్రామస్తులు ఎక్కువ మంది రావటంతో భయపడిపోయి మాదికాదని అంగీకరించారు. వారు వచ్చిన బైక్ నంబర్ కూడా కర్ణాటక రాష్ట్రానికి చెందినట్లుగా ఉండటంతో ఇది ఎక్కడిదని నిలదీశారు. దీంతో దానిని హైదర్షాకోట్‌లో దొంగిలించి తీసుకువస్తున్నట్లు చెప్పారు. దీంతో స్థానికులు బైక్ దొంగలుగా భావించి పోలీసులకు సమాచారం అందించి అప్పగించారు. ఇద్దరు యువకుల్లో ఒకరు లంగర్‌హౌస్‌కు చెందిన సుజీత్ అని, మరొకరు తాండూరులోని కోత్లాపూర్‌కు చెందిన సుభాస్‌గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దొంగిలించిన బైక్ నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.



బైక్ అపహరణకు యత్నిస్తూ పట్టుబడిన నిందితులు

షెడ్డు పైనుంచి పడి కూలీ దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: పౌల్ట్రీ షెడ్డు నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తు కూలీ కింద పడి మృతి చెందిన సంఘటన బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని పీర్లగూడ గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఓ పౌల్ట్రీ ఫాంలో షెడ్డును నిర్మించేందుకు దూసకల్ గ్రామానికి చెందిన మల్లేష్(34) కూలీగా వెళ్లాడు. షెడ్డు నిర్మాణ సమయంలో సిమెంట్ రేకులు నాసిరకం కావడంతో రేకులు విరిగి షెడ్డుపై నుంచి మల్లేష్ కింద పడి పోయాడు. ఆయన తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. వెంటనే పౌల్ట్రీఫాం యజమానికి సమాచారం అందించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మల్లేశ్ మృతితో దూసకల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్

పౌల్ట్రీ ఫాంలో నాసిరకం రేకులు కావడంతోనే రేకులు విరిగి మల్లేష్ కింద పడి చనిపోయాడని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఆయన ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. మల్లేష్ మృతితో కుటుంబం రోడ్డున పడుతుందని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి పౌల్ట్రీ యజమాని రూ.10 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

నీట్ లీకేజీపై విచారణ జరిపించండి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

ఇబ్రహీంపట్నం: నీట్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థుల జీవితాలతో మోదీ ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. నీట్ పరీక్ష లీకేజీలపై ప్రధానీ మోదీ స్పందించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్త ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షుడు ఎ జంగయ్య, రాఘవేందర్, పవన్, సురేష్, మహేశ్, జగన్ ప్రవీణ్, రాజశేఖర్, ప్రశాంత్‌లు పాల్గొన్నారు.

9 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న తొమ్మిది మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.కరుణాకర్‌రెడ్డికి లాలాగూడ, కె.సత్యనారాయణను బండ్లగూడ, ఎస్.శ్రేయను సౌత్ ఈస్ట్‌జోన్ మహిళ ఠాణాకు స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా నియమించారు. బి.శ్రీనివాసరావును బండ్లగూడ, షేక్ జహంగీర్ యాదవ్‌ను ఆసిఫ్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. పల్లె పద్మను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, షకీర్ అలీని అసెంబ్లీ సెక్యూరిటీకి, జె.మహేందర్‌రెడ్డిని సిటీ సెక్యూరిటీ వింగ్‌లకు బదిలీ చేశారు.

పాడి సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: గత పాలకుల నిర్లక్ష్యంతో పశు వీర్య శుద్ధి కేంద్రం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామశివారులో పశు వీర్య ఉత్పత్తి కేంద్రం భవనాలను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాడిపై ఆధారపడిన రైతులకు మేలు జాతి పశువులను అందించి పశుగణాభివృద్ధిని పెంచడమే వీర్య ఉత్పత్తి కేంద్రం లక్ష్యమన్నారు. ఈ కేంద్రం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఉత్పత్తి కేంద్రం నిర్వహణకు కావాల్సిన యంత్రాలు, పరికరాలు లేకపోవడంతోనే ప్రారంభానికి నోచుకోవడం లేదన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పశువీర్య ఉత్పత్తి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ శ్రవణ్‌కుమార్, వెటర్నరీ వైద్యురాలు సునీత, రవితేజ, చంద్రయ్య, నాయకులు యాదయ్యయాదవ్, మహ్మద్ అలీఖాన్‌బాబర్, నరేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, పురుషోత్తం రెడ్డి, శేఖర్, శ్రీనివాస్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కేశంపేట: కాంట్రాక్టర్లు ప్రభుత్వ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట గ్రామ శివారులోని అమ్మచెరువు వాగు వద్ద బిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. రోడ్లు బాగుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, బాలరాజ్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

బైక్‌పై వచ్చి అపహరణ, సీసీ కెమెరాల్లో రికార్డు



బాధితురాలి మెడపైన గాయాలు

కేశంపేట: వ్యవసాయ పొలంలో ఉన్న మహిళ మెడలో నుంచి బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన సంఘటన మండల పరిధిలోని లేమామిడి గ్రామ శివారులోని మేల్ల కుంట వద్ద బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేల్లకుంటకు చెందిన ఏర్వ జయమ్మ షాద్‌నగర్–ఆమనగల్లు రోడ్డు పక్కనే ఉన్న తమ వ్యవసాయ పొలంలో పశువుల మేపుతున్నారు. తలకొండపల్లి వైపు నుంచి కేశంపేట వైపు వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాక్కొని వెళ్లాడు. బైక్‌పైన చోరీ చేసిన వ్యక్తితో పాటు ఓ మహిళ, చిన్న బాబు ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. బాధితురాలు ఏర్వ జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు. లేమామిడిలో గ్రామంలో ఉన్న సీసీ కెమెరాల్లో నిందితుడితో ఆనవాళ్లు గుర్తించామని, త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.



సీసీ కెమెరాల్లో రికార్డు అయిన ఆనవాళ్లు

బోర్డు తిప్పేసిన సాఫ్ట్‌వేర్ కంపెనీ

- రోడ్డున పడ్డ వంద మంది ఉద్యోగులు

గచ్చిబౌలి: ఉత్తమ శిక్షణ, ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మించిన ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ బోర్డు తిప్పేయడంతో ఉద్యోగులు రోడ్డున పడ్డారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సి.హెచ్ వెంకన్న తెలిపారు. గచ్చిబౌలి టెలికాంనగర్‌లో రైల్ వరల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ మే 24న కార్యకలాపాలు ప్రారంభించింది. శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్కో వ్యక్తి నుంచి రూ.40 నుంచి రూ.50 వేలు వసూలు చేశారు. కాగా గత ఐదు రోజులుగా కంపెనీని మూసివేశారు. మిగతా రాష్ట్రాలలో వాకబు చేయగా కంపెనీ మూసివేస్తే అక్కడా కేసులు అయ్యాయని తెలుసుకొని బాధితులు అవాక్కయ్యారు. కొందరు బాధితులు బుధవారం రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపు వంద మంది నుంచి రూ.18 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, దేశవ్యాప్తంగా ఎంత మందిని మోసం చేశారో తెలియాల్సి ఉందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బెంగళూరు, ముంబై, పూణే,ఇండోర్, రాయపూర్, హైదరాబాద్‌లలో బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. ఒకే రోజు అన్ని బ్రాంచ్‌లను మూసినట్లు ఆయన వివరించారు. ఇది ఇలా ఉంటే దేశ వ్యాప్తంగా 800 మంది బాధితులు ఉంటారని, రూ.ఐదు కోట్ల వరకు వసూలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. బెంగళూర్‌లో ఉండే రైల్ వర ల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రకాశ్ సింగ్‌తో పాటు మరికొందరిపై కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.



మూతపడ్డ రైల్ వరల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ

బాలిక కిడ్నాప్ కేసులో ఐదేళ్లు జైలు శిక్ష



విశాల్ బింద్

మంచాల: బాలికను కిడ్నాప్ చేసి ప్రేమ పేరుతో వేధించిన యువకుడికి ప్రత్యేక పోక్సో కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మంచాల ఎస్ఐ రవినాయక్ తెలిపిన వివరాల ప్రకారం... మంచాల మండలంలోని నోముల గ్రామంలోని ఆయిల్ మిల్ కంపెనీలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని బల్లీయా ప్రాంతానికి చెందిన విశాల్ బిందు అనే యువకుడు పని చేసే వాడు. 2022లో పని చేసే చోట ఓ బాలికను కిడ్నాప్ చేసి, ప్రేమ పేరుతో వేధించిన ఘటనలో పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పోక్సో కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష , రూ.20వేలు జరిమానా విధించింది. అదే విధంగా బాధిత బాలికకు ప్రభుత్వం నుంచి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించాలని తీర్పు నిచ్చింది.

బురద కుంటలో పడి ఊపిరాడక వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

శంకర్‌పల్లి: తాగిన మైకంలో బురద కుంటలో పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మోకిల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. మోకిల ఎస్ఐ అహ్మద్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మియాఖాన్ గడ్డ గ్రామ శివారులోని కాంప్లెక్స్ వెనుక యాదిరెడ్డి అనే వ్యక్తి పొలం ఉంది. మంగళవారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆ పొలం వద్దకు వెళ్లి అతిగా మద్యం తాగాడు. అక్కడ పక్కనే ఉన్న బురద కుంటలోకి వెళ్లాడు. దీంతో అతనికి ఊపిరాడక మృతి చెందాడు. ఆ పొలానికి సమీపంలో సీసీ కెమెరాలు ఉండడంతో ఆ వ్యక్తి తాగి, పడిపోయిన విషయాలు సీసీకెమెరాలో రికార్డ య్యాయి. బుధవారం ఉదయం ఈ విషయాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేశారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ చేసిన దంపతులకు రెండేళ్ల జైలు

యాచారం: వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న ఓ మహిళ రైతు మెడలో పుస్తెల తాడు చోరీకి పాల్పడిన దంపతులకు బుధవారం ఇబ్రహీంపట్నం న్యాయస్థానం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. యాచారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2018 అక్టోబర్ 4న తక్కళ్లపల్లి తండాకు చెందిన అంగోత్ జంకు తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుంది. అటుగా బైక్‌పై వచ్చిన సరూర్‌నగర్‌కు చెందిన నందిపాటి వినోద్, కీర్తన అనే దంపతులు దాహం వేస్తుందని నీళ్లు అడిగారు. జంకు నీళ్లు ఇచ్చే సమయంలో దంపతులు ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కున్నారు. కిందపడిపోయిన జంకు తెరుకునే లోపే అక్కడి నుంచి వారు పరారయ్యారు. జంకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న యాచారం పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా పుస్తెల తాడు చోరీకి పాల్పడింది వినోద్, కీర్తన దంపతులేనని గుర్తించి పూర్తి వివరాలతో ఇబ్రహీంపట్నం న్యాయస్థానానికి అందజేశారు. పరిశీలించిన కోర్టు బుధవారం వినోద్, కీర్తన దంపతులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించింది.

స్టార్ ఆస్పత్రిలో ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్

రాయదుర్గం: స్టార్ ఆస్పత్రి ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించడం అభినందనీయమని ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో 'స్టార్ ట్రామా, యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్'ను ఆయన ప్రారంభించారు. అనంతరం స్టార్ ఆస్పత్రి నగరంలో ప్రవేశపెట్టిన 10 అధునాతన కార్డియాక్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లను కూడా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టార్‌లో అత్యవసర సేవలు ఆధునికతను సంతరించుకోవడం గొప్ప విషయమన్నారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా తాము రోగులకు అత్యంత మెరుగైన సేవలందిస్తున్నామని చెప్పారు. స్టార్ ఆస్పత్రి ఎమర్జెన్సీ మెడిసిన్ గ్రూప్ లీడ్ డాక్టర రాహుల్ కట్టా, ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టార్ ట్రామా అండ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ నెట్‌వర్క్‌ను ప్రారంభిస్తున్న అల్లు అరవింద్

60 కిలోల గంజాయి స్వాధీనం

సికింద్రాబాద్: ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 15 లక్షల విలువ చేసే 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు సాయీశ్వర్‌గౌడ్, సరస్వత్ కథనం ప్రకారం..జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా ప్లాట్‌ఫామ్‌లు, రైళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 2వ ప్లాట్‌ఫామ్‌కు చేరుకున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అనుమానాస్పదంగా కనిపించిన రెండు ట్రాలీ బ్యాగులను పోలీసులు అనిఖీ చేశారు. అందులోంచి గంజాయి ప్యాకెట్లు బయట పడ్డాయి. బ్యాగులను విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి తరలించిన అస్సాం రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన దిలీప్‌కుమార్ (34) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అదే కేసులో గంజాయిని విక్రయించిన ఒడిశాకు చెందిన తపన్, ఢిల్లీలో వ్యాపారం చేసేందుకు దిగుమతి చేసుకునే ప్రయత్నం చేసిన బిజయ్‌లను నిందితులుగా చేర్చి వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో జింకపిల్ల మృతి

శంషాబాద్ రూరల్: తప్పిపోయి వచ్చిన జింక పిల్లపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పాల్మాకుల శివారులో ఉన్న ఓ తోట నుంచి బుధవారం ఉదయం జింక పిల్ల తప్పిపోయి బయటకు వచ్చింది. దీన్ని కుక్కలు వెంబడించడంతో చాలా దూరం పరుగెత్తి అలిసిపోయిన ఓ చోట కుప్పకూలిపోయింది. తర్వాత కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమివేశారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా.. అక్కడకు చేరుకున్న అధికారులు జింకను పరిశీలించగా..అప్పటికే మృతి చెందింది.



విద్యా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

సైదాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రికి ఈ మెయిల్ ద్వారా వినతి పత్రాన్ని పంపారు. అనంతరం కళ్యాణ్‌నగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించాలని ఆయన వివరించారు. అయితే ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వేలాది రూపాయలను ఫీజులుగా వసూలు చేస్తూ చట్టాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ చేయకపోవడం సరికాదని అన్నారు.

శాలిబండలో యువకుడి హత్య

చాంద్రాయణగుట్ట: పాత కక్షల కారణంగా నలుగురు సోదరులు కత్తులతో దాడి చేసిన సంఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాలాపత్తర్‌కు చెందిన అన్వర్, అసద్‌లు పాత నేరస్తులు. అదే ప్రాంతంలో వాజిద్, సాజిద్ సోదరులతో పాటు వారి కజిన్ బ్రదర్స్ ఖదీర్, రఫిక్ సిమ్లాన్ కూడా నివాసం ఉంటారు. ఈ రెండు గ్రూప్‌ల నడుమ పాత గొడవలున్నాయి. బుధవారం తెల్లవారుజామున మాట్లాడుకుందామంటూ అన్వర్ సోదరులు వాజిద్‌ను తాడ్‌బన్‌లోని ఫాతిమా ఆసుపత్రి వద్దకు పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న వాజిద్ సోదరులు కూడా అక్కడికి వెళ్లారు. మాట్లాడుకునే క్రమంలో మాటామాటా పెరిగింది. దీంతో రెచ్చిపోయిన అన్వర్, అసద్‌లు వాజిద్ సోదరులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన రఫిక్ సిమ్లాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శాలిబండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

NOTICE

The General Public is hereby intimated that 1.Aluganti Suvarna, W/o A. Raghava Reddy D/o Anantha Reddy, Aged 65 years, Occ: House hold, R/o.H.No.2-68, Sapallyguda Village, Shabad Mandal, Ranga Reddy District and 2. Bendhi Surender Reddy, S/o. Late B. Anantha Reddy, Aged 60 years, Occ: Agriculture, R/o. Flat No.302, Mega Residency, Sai Ram Nagar Colony, Karmanghat, Hyderabad, filed a suit on the file of Honorable Junior Civil Judge, Shadnagar vide O.S.No.224/2022 praying the Honorable Court to declare the plaintiffs are the absolute owners and possessors of the suit schedule property being the legal heirs of deceased Yacharam Anthamma, W/o Y. Ram Reddy, who died on 01-01-1964 and Bendhi Ramchandramma W/o Anantha Reddy, who died on 04-10-2021. In consideration of the said suit, the Honorable Court pleased to pass its orders vide I.A. No. 429/2024 in O.S.No.224/2022 directing the undersigned to publish the notice in your daily newspaper calling objections if any for declaring them towards the Legal Heirs cum Successors of Late Yacharam Anthamma, W/o. Y. Ram Reddy and Bendhi Ramchandramma W/o Anantha Reddy and if such any person or persons have any objections declaring the above said as the legal heirs of the deceased Late Yacharam Anthamma, W/o. Y. Ram Reddy and Bendhi Ramchandramma W/o Anantha Reddy, such person[s] should appear before the Honorable Court on the next date of hearing on 27-06-2024 at 10-30 AM. Failing which the Honorable Court will proceed with the case basing on the record of the case. Hence the notice as per the order of Honorable Court.

Thanking you sir.

B. TRIMURTHI PRASAD, Advocate
Christian Colony, Shadnagar.
Rangareddy District. Cell:90000 94710